భారమైన ఎరువుల ధరలు

- బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు పెంపు
- ఖరీఫ్ సీజన్‌లో భారీగా పంట నష్టం
- రబీ సీజన్‌లో ఎరువుల మోత
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఎరువు కలుపుతున్న రైతులు



ఎరువుల బస్తాలు

తాడేపల్లిరూరల్: ఒకవైపు అధిక వర్షాలు, మరో వైపు వర్షాభావ పరిస్థితులతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. మంగళగిరి నియోజక వర్గంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభించగానే అధిక వర్షాలు కురిసి వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు తమ పంటలను కాపాడుకుని చేతికొచ్చే సమయానికి మరలా తుఫాను వెంటాడడంతో రైతులు 90 శాతం వరకు పంట నష్టపోయారు. ఇప్పుడు రబీ సీజన్ వచ్చే సరికి ఎరువుల కంపెనీలు బస్తాపై రూ.100 నుంచి రూ.200లు పెంచడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుంచి ఎరువుల ధరలు పెంచారు. పసుపు, కంద, చేమ, అరటి ఇతర వాణిజ్య పంటలు పండించే వారితో పాటు మొక్కజొన్న, పిల్లి పెసర, జొన్న పండించే రైతులు నిన్నమొన్నటిదాకా వర్షాలతో నష్టపోయారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు న్యాయం చేయలేదు. మద్దతు ధర గతంలో కన్నా ఒక ధాన్యం బస్తా రూ.500 తక్కువకు కొన్నారు. ఎలాగోలా పండించిన పంటను అమ్ముకుని రబీ సీజన్‌లో అయినా అప్పుల బాధ నుంచి బయట పడదామంటే ఎరువుల కంపెనీలు అమాంతం రేట్లు పెంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు(రూ.ల్లో)

ఎరువు	పాత ధర	కొత్త ధర	వ్యత్యాసం
28-28-0	1,680	1,800	120
14-35-14	1,680	1,800	120
20-20-0-13	1,100	1,300	200
10-26-26	1370	1470	100
16-20-0-13	1,150	1,250	100

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ ఏడాది తీవ్రంగా నష్టం జరిగింది. ఈ సీజన్‌లో వివిధ రకాల ఎరువుల ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికి వదిలేసింది. రైతు సేవా కేంద్రాల నుంచి సబ్సిడీపై ఎరువులు అందించాలి. లేదంటే రైతుల తరుపున ఆందోళన చేస్తాం.

– ఈశ్వర్ రెడ్డి, రైతు సంఘం నాయకుడు

ధరల భారం పెరిగిపోతోంది



ప్రకృతి విపత్తుల వల్ల చాలా నష్టపోయాం. గ్రామాల్లో అప్పులు చేశాం. ఎరువుల ధరల రూపంలో మరో సమస్య వస్తోంది. ఏడాదికి రూ.40 వేల వరకు భారం పడుతోంది. మరోసారి ఎరువుల ధరలు పెంచడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– హరిబాబు, ఇప్పటం, రైతు

పెట్టుబడులు పెరిగాయి



ఎరువుల ధరలు ఇష్టానుసారంగా పెంచడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ప్రతికూల వాతావరణం, తెగుళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండుసార్లు వరదలు వచ్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎరువుల ధరలు పెంచడంతో మరింత ఇబ్బంది పడుతున్నాం.

– కె.వీర వెంకటనారాయణ, రైతు

క్లుప్తంగా

రైసు మిల్లు తనిఖీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర రైసు మిల్లును ఆదివారం తనిఖీ చేసినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. మిల్లులో ఉన్న నాలుగు బంకర్లలో ఒకదానిలో రేషన్ బియ్యం ఉన్న గుర్తించామన్నారు. సిబ్బందితో వాటి బరువును అంచనా వేయాల్సి ఉందన్నారు. రైసు మిల్లు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ 6ఏ కేసు నమోదు చేసేందుకుగాను పంచనామా చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వోలు సుబాని, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నంద్యాల, ధర్మవరం. మార్కాపురం, పల్నాడు జిల్లా నుంచి భక్తులు ఇక్కడికి చేరుకున్నారు. కొండను ఎక్కి తల నీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై వరకు వెళ్లలేని భక్తుల కోసం దిగువన ఏర్పాటు చేసిన కార్మెల్ మాత స్వరూపానికి భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు.

సీపీఎం కరపత్రాల పంపిణీ



తాడేపల్లిరూరల్ : ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచే మతోన్మాద బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నేతాజీ సెంటర్‌లో ఆదివారం సీపీఎం శ్రేణులు భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. బూరగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి బీజేపీ పరిపాలనలో పెనుముప్పు ఏర్పడిందన్నారు. దాన్ని కాపాడుకోవాలిసన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభావం పడి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, దర్శనపు విజయ్‌బాబు, కోట బాబూరావు, ఎండి బాజ్జి, ఎం.మేరి, ఎం.దావీదు పాల్గొన్నారు.

లైబ్రరీ పని వేళలు మార్పు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణంలోని శివాలయం రోడ్డులో ఉన్న లైబ్రరీ పని వేళలను మార్పు చేసినట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. పట్టణ పరిధిలోని వివిధ పోటీ పరీక్షల అభ్యర్థులు మంత్రి నారా లోకేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారన్నారు. మంత్రి గ్రంథాలయ శాఖ అధికారులతో మాట్లాడి ఉదయం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరచి ఉంచే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

తూటికాడను తొలగించరూ..



ఫిరంగిపురం: వేములూరిపాడు వద్ద నున్న కొండవీటి మేజరు కాలువలో తూటికాడ ఎక్కువగా ఉంది. దీంతో నీటి పారుదల సక్రమంగా ఉండక రైతులు ఇబ్బందిపడుతున్నారు. అంతేకాక ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, కాగితాలు, చెత్త వంటి వ్యర్థాలు కూడా చేరి దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. నీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో నీరు ఇంకి కాలువ గట్టునానుకొని ఉన్న పంట పొలాలకు ఇబ్బంది కలుగుతోందని రైతులు చెబుతున్నారు. కాలువ గట్టుపై పిచ్చి మొక్కలు ఎక్కువగా మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూటికాడ, వ్యర్థాలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కె.బాబు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి విద్యాశాఖ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ ప్రత్యేకంగా తయారు చేయించిన లంచ్ బాక్సు బ్యాగులు, 2025 సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ కె.బాబు బ్యాగులను ఆవిష్కరించారు. పాత బ్యాంక్ కాలనీలోని యూపీ స్కూల్ (ఎల్‌ఈ గర్ల్స్)లో యూటీఎఫ్ పట్టణ అధ్యక్షులు కె.సైదా నాయక్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె. బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ పట్టణ శాఖ ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా లంచ్ బ్యాగ్‌లను ప్రత్యేకంగా తయారు చేయించి ఉచితంగా అందజేయడం అభినందనీయమమన్నారు. పట్టణ అధ్యక్షుడు సైదా నాయక్ మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరికీ లంచ్ బ్యాగ్ అందజేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శివరామిరెడ్డి, కోశాధికారి ఎస్కే రహమాన్, జిల్లా నాయకులు ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికుల కార్పొరేషన్ ప్రకటనపై హర్షం



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనిక ఉద్యోగులు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ధన్యవాదాలు తెలియజేస్తోందని గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె. గోవిందరావు అన్నారు. ఆదివారం మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు కె. గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు మాజీ సైనికుల సంక్షేమ సంఘాలు ఉన్నాయని, ప్రస్తుతం అన్ని సంఘాలను ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉండాలని లక్ష్యంతో వైజాగ్ తదితర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించామన్నారు. త్వరలో సంఘాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంగళగిరి వెటర్న్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, వివిధ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో మెడికల్ క్యాంప్



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో పల్లెటూరి చారిటబుల్ ట్రస్ట్, లూపిన్ డయాగ్నోసిస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడకల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జొన్న రాజేష్ మాట్లాడుతూ ఉండవల్లి గ్రామ ప్రజల కోసం కేవలం రూ.10లకే అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారని, సుమారు 100 మందికి పైగా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

ఫ్రిడ్జ్ వితరణ



తాడేపల్లిరూరల్: అగ్నిప్రమాదంలో గృహోపకరణాలు నష్టపోయిన బాధితుడికి ఆదివారం ఫ్రిడ్జ్ వితరణ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్‌లో సయ్యద్ మొహమ్మద్ అనే వ్యక్తి అద్దెకు నివాసముంటున్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని సామగ్రి కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎలక్ట్రీషియన్ అంజాద్ బేగ్ సయ్యద్ మొహమ్మద్‌కు ఫ్రిడ్జ్ కొనుగోలు చేసి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సుభాని, సాయి

మేడికొండూరు: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి ఈ ఘటన పేరేచర్ల సమీపంలోని హరియాలి పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. గుంటూరుకు చెందిన సుభాని, సాయి ద్విచక్ర వాహనంపై పనిమీద వెళ్లి.. తిరుగు ప్రయాణంలో గుంటూరు వెళ్తున్నారు. పెట్రోల్ బంకు వద్ద గుంటూరు నుంచి సత్తెనపల్లి వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ద్విచక్ర వాహనదారులకు గాయాలు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలులో చైను లాగిన ఆకతాయి

తెనాలి రూరల్: ఆకతాయి చైను లాగడంతో రైలు నిలిచిపోయిన ఘటన ఆదివారం సాయంత్రం తెనాలిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ఆదివారం సాయంత్రం తెనాలిలోని మల్లెపాడు గేటు వద్దకు రాగానే ఓ వ్యక్తి చైను లాగడంతో ఒక్కసారిగా రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. చైను లాగిన వ్యక్తిని తోటి ప్రయాణికులు టీసీకి అప్పగించారు. ఐదు నిమిషాలు ఆగి రైలు బయలుదేరిందని రైల్వే వర్గాలు తెలిపాయి.

టిడ్కో గృహాలను సత్వరమే అందించాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు



మాట్లాడుతున్న నాగాంజనేయులు

రేపల్లె రూరల్: టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలన్నారు. గతంలో పూర్తి చేసిన టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, రేపల్లె పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, శాఖ కార్యదర్శి చొక్కాకుల శివశంకర్, లబ్ధిదారులు సత్యనారాయణ, చంద్రశేఖర్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులు



తాడేపల్లిరూరల్ : కాకినాడలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో దుగ్గిరాల మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆదివారం పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాల్గవ రోజు దుగ్గిరాల మండలం నుంచి 20 మంది ఉపాధ్యాయులు అక్కడకు వెళుతున్నామని చెప్పారు. జిల్లా కోశాధికారి ఎండీ గయసుదౌలా, మండల అధ్యక్షురాలు కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిని ప్రభుత్వం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కే వలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అఖిల భారత యువజన సమైక్య గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే వలి డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భగవాన్ ఏఐవైఎఫ్ కార్యాలయంలో నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు జాలాది నవీన్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు. వలి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తానని చెప్పి, విఫలమైందని విమర్శించారు. వాలంటీర్లకు రూ.5 వేలు కాదు రూ.10 వేలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వలంటీర్లను విధుల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తానని హామీ ఇచ్చారని, ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నందుకు అభినందనీయమన్నారు. చిన్న పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్మించాలని కోరుతున్నామన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంటూరి గోపిరాజు, ప్రధాన కార్యదర్శిగా జాలాది నవీన్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల క్రాంతి, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల నరసింహను ఎన్నుకున్నారు. జాలాది విజయ్, శ్రీకాంత్, కిరణ్, బాబా, మణికంఠ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పెదవడ్లపూడి గ్రామంలో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కేరింత అనే కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ అన్నే రత్న ప్రభాకర్ మాట్లాడుతూ స్నేహం, సేవ అనే ప్రధాన లక్ష్యంతో రోటరీ పనిచేస్తోందన్నారు. రోటరీ ప్రతినిధుల మధ్య ఐక్యత ఉంటే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అలాంటి ఐక్యతకు కేరింత వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. పబ్లిక్ ఇమేజ్ కో చైర్ ఇసునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఫ్రెండ్ షిప్, ఫెలోషిప్‌లకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రఅనంతరం మంగళగిరి, తాడేపల్లి, తెనాలి, గుంటూరు రోటరీ క్లబ్‌లకు చెందిన కుటుంబాలకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి అందే మురళి, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, తాడేపల్లి క్లబ్ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, తెనాలి ప్రతినిధి కందిమళ్ళ స్వప్న, వీజే విద్యా సంస్థల డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మద్దతు తెలియజేస్తున్న వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలియజేశారు. గత 32 సంవత్సరాలుగా ఏసీసీ కార్మికులు పోరాటం చేస్తుంటే పాలక పక్షాలు ఎన్ని మారినా కార్మికుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించడం అంటే కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడమేన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలలో వై. యెహోషువా, సీహెచ్ పిచ్చయ్య, ఇస్మాయిల్, సక్రు నాయక్, బి.నవనీతం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

శివారు..పట్టించుకోండి సారూ..!



రెడ్ల బజారు, జయభారత్ కాలనీకి వెళ్లే రోడ్డులో చెత్త



రావిచెట్టు సెంటర్ నార్త్ పాఠశాల వెనుక మురికి కూపం

తాడికొండ: తాడికొండ గ్రామంలో పారిశుద్ధ్యం ప్రధాన రహదారులకే పరిమితమైంది. 36 వేల మంది జనాభా ఉన్న గ్రామంలో ప్రజల అవసరాలకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేరు. ఉన్న వారితో సక్రమంగా పనిచేయించలేని దుస్థితిలో అధికారులున్నారు. మండల కేంద్రంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. సిబ్బంది ప్రధాన రహదారులు, నాయకుల ఇళ్ల చుట్టూ పరిశుభ్రం చేస్తున్నారే కానీ, శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సక్రమమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న కాలువల్లో మురుగు తొలగించే వారు లేక దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీరు బయటకు వెళ్లే దారి లేక దోమలు బెడద అధికమై శివారు ప్రాంత ప్రజలకు నిద్ర కరువైంది. రావిచెట్టు సెంటర్ నార్త్ పాఠశాల వెనుక జనావాసాల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోతికి కరెంటు షాక్



కోతికి వైద్యం చేస్తున్న రంగారావు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో విద్యుదాఘాతానికి గురైన కోతికి స్థానికులు ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. గ్రామంలోకి వచ్చిన గోతుల గుంపులోని ఓ కోతి, ఒక చెట్టుపై తిరుగుతుండే క్రమంలో కొమ్మ విద్యుత్ తీగెలకు తగిలింది. ఆ ప్రభావంతో విద్యుత్ షాక్ తగిలి కిందపడింది. గిలగిల కొట్టుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన అక్కడి యువకులు గ్రామంలోని విశ్రాంత జూనియర్ వెటరనరీ అధికారి ఆలపాటి రంగారావును పిలిపించారు. ఆయన స్థానికుల సాయంతో కోతికి ఇంజక్షన్లు చేసి ప్రాథమిక చికిత్స అందించారు. దీంతో ఆ కోతి కొద్దిసేపటికి ప్రాణాపాయం నుంచి బయటపడింది. కోతుల గుంపులు ఆహారం దొరక్క ఊర్లోకి వస్తున్నాయని, ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.